క్లుప్తంగా

నేడు పోలిపల్లెమ్మ పండగ



మునగపాక: మండలంలోని గవర్ల అనకాపల్లిలో పోలిపల్లి అమ్మవారి పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ బుద్ద రవి శంకర్ తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేరోజు ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో రేలారేలాయే కార్యక్రమంతో పాటు మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

18న వాడ్రాపల్లిలో పారిపల్లెమ్మ తల్లి పండగ



ఉత్సవ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: వాడ్రాపల్లిలో ఈ నెల 18న జరగనున్న పారిపల్లెమ్మ తల్లి పండుగను ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా మార్చిలో ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ ఏడాది కూడా రాజకీయాలకు అతీతంగా ఉత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు చేపట్టకుండా సమాజానికి దోహదపడే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామపెద్దలు మళ్ల వరహా నరసింగరావు, నూకప్పారావు, టెక్కలి పరశురామ్, మళ్ల రాజేష్, రాంబాబు, సత్తిబాబు, చంద్రమోహన్, పరమేష్ పాల్గొన్నారు.

15న దళితవాడలో రామాలయం ప్రారంభం



మునగపాక దళితవాడలోని రామాలయం

మునగపాక: స్థానిక దళితవాడలోని రామాలయాన్ని ఈ నెల 15వ తేదీన ఘనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఆలయాన్ని రంగులతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు, వేద పండితులు వెలవలపల్లి కోటేశ్వర శర్మ మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. 15న ఉదయం 10.28 గంటలకు సీతారాముల విగ్రహావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని సీతారామాలయ కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

మునగపాక గ్రామాభివృద్ధికి సహకరించాలి



రహదారి ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: రాజకీయాలకు అతీతంగా స్థానిక గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక దళితవాడలోని సత్తెమ్మతల్లి ఆలయం నుంచి పాటిపల్లి వరకు రహదారి నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి ఏర్పాటు ద్వారా రవాణా సదుపాయం మెరుగుపడుతుందన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, పిల్లి అప్పారావు, కోనపల్లి రామ్మోహనరావు, డొక్కా నాగభూషణం, బీలా లక్ష్మణరావు, ఆడారి లక్ష్మణరావు, టెక్కలి దేవకీరావు, ఆడారి శివప్పారావు, ఆడారి సోమునాయుడు, దిమ్మల నూకరాజు, కరణం గణేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మోదకొండమ్మ తల్లి గుడికి విరాళం



విరాళం అందజేస్తున్న సతీష్, జ్యోతి దంపతులు

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న మోదకొండమ్మ తల్లి గుడికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా మునగపాకకు చెందిన మా ఊరి రాజు కుమారుడు సతీష్, జ్యోతి దంపతులు సోమవారం రూ.5,116 ఆలయ కమిటీకి అందజేశారు.

- జనసంద్రమైన గరుడాద్రి
- వేడుకగా ఉపమాక వెంకన్న కల్యాణోత్సవం
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనం
- ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన హోంమంత్రి



స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్లో బారులు తీరిన భక్త జనం

స్వామివారికి తొలి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

మెట్ల మార్గం గుండా గరుడాద్రిపైకి వెళ్తున్న భక్తులు

భక్తకోటి పరవశం



స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: భక్తకోటితో ఉపమాక పులకించింది. కోనేటి రాయుడు కల్యాణాన్ని కనులారా తిలకించేందుకు వచ్చిన భక్తజనంతో ఉపమాక కిటకిటలాడింది. ఏడుకొండలవాడా వెంకటరమణ గోవిందా..గోవింద.. అంటూ గరుడాద్రి పర్వతంపై ఏకశిలపై కల్కి అవతారంలో వెలసిన ఉపమాక వెంకన్నను తనివితీరా దర్శించుకునేందుకు సోమవారం లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు.

తెల్లవారుజాము నుంచే దర్శనాలు ప్రారంభం...

ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని సోమవారం తెల్లవారు జామున 2 గంటలకు కొండపై కల్కి అవతారంలో వెలసిన మూలవిరాట్‌కు తొలి అభిషేకం నిర్వహించారు. నిత్యార్చనలు పూర్తి చేసిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. గరుడాద్రి పర్వతంపై స్వామివారు ఏకశిలపై అశ్వారూఢుడై షడ్భుజములతో వెలిశారు. కల్యాణం రోజున స్వామి నిజ స్వరూపాన్ని దర్శించుకునేందుకు తెల్లవారు జామున రెండు గంటల నుంచే భక్తజనం మెట్ల మార్గం గుండా మూలవిరాట్ సన్నిధికి చేరారు. వయోబేధం లేకుండా చిన్నపిల్లల నుంచి పండు ముదుసలి వరకు గరుడాద్రి పర్వతం చేరుకున్నారు. ఆలయ ముఖ ద్వారానికి ఎదురుగా ఉన్న ఆస్థాన మండపం, బేడా మండపం, స్వామి ఉత్సవమూర్తులున్న మండపం, మెట్ల మార్గం ఉపమాక పురవీధులు వేలాదిమంది వెంకన్న భక్తులతో కిటకిటలాడాయి. స్వామి దర్శనానికి వచ్చిన వారిలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ చిక్కాల రామారావు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బి. తాతయ్యబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు వెంకటేష్, దేవస్థానం మాజీ చైర్మన్లు కొండబాబు, బుజ్జి, పెంకులరాజు తదితరులు ఉన్నారు.



తిరుపతి లడ్డూలు విక్రయిస్తున్న టీటీడీ సిబ్బంది

పుష్కరిణిలో పుణ్యస్నానాలు...

బ్రహ్మ తపస్సు చేసిన బందుర సరస్సు (పుష్కరిణి)లో పుణ్య స్నానమాచరించి స్వామి దర్శనానికి వచ్చారు. విశాఖ జిల్లా నుంచే కాకుండా ఉభయగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు.



ఆలయం వద్ద కూచిపూడి నృత్య కార్యక్రమాలు

అద్దాల మహల్‌లో మలయప్పస్వామి...

విశాఖ సబ్ ట్రెజరీ నుంచి తెచ్చిన సర్వాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన శ్రీదేవీ భూదేవీ సమేతుడైన వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ధ్వజస్తంభం ఎదురుగా ఉన్న కల్యాణ మండపంలో ఉంచి భక్తులకు దర్శనం కల్పించారు. కల్యాణ కాంతులీనుతున్న స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని చూచి తరించేందుకు భక్తులు సోమవారం తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో వేచి ఉన్నారు. మహ ద్వారానికి కిలోమీటరు దూరం నుంచే క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో గంటల తరబడి లైన్లో నడుచుకుంటూ స్వామి దర్శనానికి వెళ్లారు.

పట్టువస్త్రాల సమర్పణ

స్వామివారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున హోంమంత్రి వంగలపూడి అనిత, హెటిరో యాజమాన్యం తరపున కంపెనీ ప్రతినిధులు సుబ్బారెడ్డి, రాజారెడ్డి, కుశ్లాయి రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ మర్యాదలతో బేడా మండపం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం నూతన వస్త్రాలను స్వామివారికి సమర్పించారు.

హెటిరో ఎంప్లాయిస్ అన్నసమారాధన...

వేలాది మంది భక్తులకు హెటిరో ఎంప్లాయిస్ వారు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నక్కపల్లి సత్యసాయి సేవా సమితి సభ్యులు పులిహోర, మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు. నక్కపల్లి నుంచి ఉపమాక వరకు రోడ్డుకు ఇరువైపులా పలువురు స్వచ్ఛందంగా భక్తులకు మజ్జిగ, ప్రసాదం, తాగునీరు సరఫరా చేశారు.

షెడ్లలో సేదతీరిన భక్తజనం

స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు ఎండబారిన పడకుండా టీటీడీవారు రాజగోపురం ఎదురుగా భారీ షెడ్లు వేయడంతో ఉపశమనం పొందారు. షెడ్ల కింద సేద తీరారు.

అలరించిన కోలాటాలు..

కల్యాణోత్సవాలను పురస్కరించుకుని, పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రత్యేక భజన బృందాలు చేసిన కోలాటం, యలమంచిలి గౌరీ శంకర కూచిపూడి నృత్య అకాడమీ వారి కూచిపూడి నత్యాలు భక్తులను అలరించాయి. సాయంత్రం నుంచి మండలంలో నలుమూలల నుంచి తోడపెద్దులను తీసుకొచ్చి భజనలు నిర్వహించారు. తెల్లవార్లు తిరునాళ్లు జరిగాయి. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమయ్య ప్రాజెక్టు వారి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. టీటీడీ వారు 10 వేల లడ్డూలు తెచ్చి విక్రయించారు.



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న హోంమంత్రి అనిత

వైద్య శిబిరాలు..

గొడిచర్ల పీహెచ్‌సీ వారు, హెటిరో పరిశ్రమ వారు ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. దర్శనానికి వచ్చిన భక్తుల్లో ఎవరైనా అస్వస్థతకు గురైతే ఇక్కడ వైద్య సేవలందించారు.

పటిష్ట బందోబస్తు..

భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో నక్కపల్లి, అడ్డురోడ్డు, పాయకరావుపేట సీఐలు కుమారస్వామి, రామకృష్ణ, అప్పన్న, 300 మంది సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. నక్కపల్లి నూకాలమ్మ ఆలయం వద్ద, మసబానవానిపాలెం, ఉపమాక నూకాలమ్మ ఆలయాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను నిలిపివేసి కాలినడకన భక్తులను ఆలయం వద్దకు అనుమతించారు.

3 వార్డులకు తాగునీటి సరఫరా బంద్

- రామచంద్రమ్మ కొండ వద్ద పాడైన పైపులైన్

యలమంచిలి రూరల్: పట్టణంలోని రామచంద్రమ్మ కొండ వద్ద తాగునీటిని సరఫరా చేసే జీఎల్ఎస్ఆర్ పైపులైన్ సోమవారం మరమ్మతులకు గురైంది. దీంతో ఎర్రవరం సంప్ నుంచి ఇక్కడకు నీటి సరఫరా నిలిచిపోయింది. పాడైన పైపులైన్‌కు మున్సిపల్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. ఈ కారణంగా సోమవారం పట్టణంలోని 4, 5, 6 వార్డులకు నీటి సరఫరా జరగదని అధికారులు తెలిపారు. వీలైనంత త్వరగా పైపులైన్‌కు మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరా పునరుద్ధరించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు సోమవారం రాత్రి తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మూడు వార్డులకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. ఇటీవల తరచూ ఎక్కడో ఒకచోట పైపులైన్లు మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సరఫరా నిలిచిపోతోంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవడంలో విఫలమౌతున్నారని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.101 కోట్లతో ప్రారంభించిన సమగ్ర రక్షితనీటి పథకం పనులను పూర్తి చేసి దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు.



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

విచక్షణా రహితంగా మందులు వాడొద్దు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం మర్రిపాలెంలో వరి పంటలో క్షేత్ర పాఠశాల సోమవారం నిర్వహించారు. హరిపురం బీసీటీ శాస్త్రవేత్త నాగేంద్రకుమార్ సస్యరక్షణ చర్యలపై వివరించారు. రైతులు విచక్షణా రహితంగా రసాయన మందులు వాడితే దుష్ప్రభావాలు కలుగుతాయని తెలిపారు. అవసరాన్ని బట్టి తగన మోతాదులో మందులను వాడాలని సూచించారు. ఏవో సుమంత మాట్లాడుతూ రైతులంతా రైతు రిజిస్ట్రీ చేయించుకోవాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి విజేత మాట్లాడుతూ వరి గింజ పాలు పోసుకునే దశలో ఉన్నందున ప్రాపికొనజోల్ మందును తగిన మోతాదులో పిచికారీ చేయాలని సూచించారు. ఎంపీఈవో మేఘన, రైతులు పాల్గొన్నారు.



మర్రిపాలెంలో క్షేత్ర పాఠశాల నిర్వహిస్తున్న దృశ్యం

రక్తదానంతో పునర్జన్మ

అచ్యుతాపురం రూరల్: అమ్మ జన్మనిస్తే, రక్తదానం మరో పునర్జన్మనిస్తుందని వైఎస్సార్‌సీపీ నాయకుడు చోడపల్లి అప్పారావు తెలిపారు. పూడిమడక గ్రామానికి చెందిన ఆయన విశాఖ సిటీలో స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 45వ సారి రక్తదానం చేశారు. స్వామి వివేకానంద నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించి ఈ నెల 9వ తేదీ నాటికి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా లయన్స్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారనన్నారు.



రక్తదానం చేస్తున్న అప్పారావు

వైభవంగా రామాలయ ప్రారంభోత్సవం

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం అప్పరాయుడిపాలెంలో రామాలయం ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పాల్గొని పూజలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధి ఎస్.రాయవరం ఫీడర్‌లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్‌లో మరమ్మతులు నిమిత్తం ఎస్.రాయవరం, వాకపాడు, వెంకటాపురం, సర్వసిద్ధి, సైతారుపేట ఆక్వా పరిశ్రమలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

లాభసాటిగా కూరగాయల సాగు..

కోటవురట్ల: కూరగాయల సాగు లాభసాటిగా ఉండడంతో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. మండలంలో ఏడాది పొడవునా పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. కూరగాయలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటోంది. అందుకు తగ్గట్టుగా రైతులు వివిధ రకాల కూరగాయలను పండిస్తున్నారు. తాము పండించిన కూరగాయలను రైతులే నేరుగా విక్రయించి రెట్టింపు ఆదాయాన్ని పొందుతున్నారు. మండలంలో సుమారు 80 ఎకరాలలో కూరగాయల సాగు ఉంది. లింగాపురం, జల్లూరు, అన్నవరం, యండపల్లి, కోటవురట్ల, రాజుపేట, చినబొడ్డేపల్లి, ఆక్సాహేబుపేట, కొడవటిపూడి, పాములవాక, నీలిగుంట తదితర గ్రామాలలో కూరగాయల సాగు ఎక్కువగా ఉంది. వంగ, టమాటా, బెండ, చిక్కుడు, బీర, మిర్చి, దొండ తదితర పంటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. పండించిన కూరగాయలను స్థానికంగా జరిగే వారపు సంతల్లోను, రహదారుల వెంబడి రైతులే నేరుగా విక్రయిస్తున్నారు. దాంతో అశీలు బెడద, రవాణా ఖర్చులు తగ్గి రెట్టింపు లాభాలు వస్తున్నాయి. విత్తు నాటాక మూడు నెలల్లో ఫలసాయం అందివస్తోంది. ఎకరాకు రూ.20 వేలు వరకు ఖర్చు కాగా పెట్టుబడి పోను రూ.30 వేలు వరకు లాభాలు వస్తున్నాయి. ఏడాదికి మూడు పంటలు తీస్తూ సుమారు రూ.లక్ష వరకు ఆదాయాన్ని పొందుతున్నారు.



జల్లూరులో బెండ చేను

యువత పోరు విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



పోస్టర్ విడుదల చేస్తున్న యలమంచిలి నాయకులు

ఎస్.రాయవరం/మునగపాక: విద్యార్థులకు సకాలంలో ఫీజులు చెల్లించక చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. ఈ నెల 12న కలెక్టరేట్ వద్ద చేపట్టబోయే యువత పోరు కార్యక్రమం కరపత్రాలను సోమవారం ఎస్. రాయవరం మండలం అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయంలో జోగులు, మునగపాక పార్టీ కార్యాలయంలో ప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రూ.4,600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంతో చదువులు మధ్యలో ఆగిపోతున్నాయని విమర్శించారు. దాంతో కాలేజీలకు వెళ్లాల్సిన విద్యార్థులు పొలాల బాట పడుతున్నారని వాపోయారు. 2014-19 మధ్యలో ఈ పథకానికి తిలోదకాలు ఇచ్చి ఇబ్బందులు పాలు చేసిందన్నారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేసి న్యాయం చేశారన్నారు. యువతకు ఇచ్చిన హామీలను పట్టించుకోని చంద్రబాబు సర్కార్ 20 లక్షల ఉద్యోగాలు లేదా ప్రతి నెలా నిరుద్యోగికి రూ.3 వేల భృతి అంటూ మోసం చేస్తుందన్నారు. ఈ హామీ అమలు చేయాలంటే ఏడాదికి రూ.7,200 కోట్లు ఖర్చు చేయాలన్నారు. దీనికి బడ్జెట్‌లో కేటాయింపులు లేవని దుయ్యబట్టారు. ఇలా అనేక సమస్యలు గాలికొదిలేసిందన్నారు. వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అద్దేపల్లి బొజ్జయ్య, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, వమ్మవరం ఎంపీటీసీ బాలం సూరిబాబు, మాజీ సర్పంచ్ మధువర్మ, నాయకులు రామరాజు, పాలుమూరు అప్పలరాజు, చోడిపల్లి గోవిందు, నాగంబోయిన శ్రీనివాసరావు, శేషు, నక్కా నాగేశ్వరరావు, మునగపాక పార్టీ నేతలు మద్దాల వీరునాయుడు, పిన్నమరాజు రవీంద్రరాజు, కాండ్రేగుల జగన్, కర్రి పెదబ్బాయి, దొడ్డి వరహా సత్యనారాయణ, శీరా రమణమ్మ, వెలగా రామకృష్ణ, ఆడారి లక్ష్మణరావు, పెంటకోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.



యువత పోరు గోడపత్రిక విడుదల చేసిన కంబాల జోగులు తదితరులు

మునగపాక: యువత పోరు పోస్టర్‌ను స్థానిక పార్టీ కార్యాలయం వద్ద జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్య నాయుడు, ఎంపీటీసీ బోడకుర్తి గణేష్, పార్టీ నేతలు బొడ్డేడ బుజ్జి, బొడ్డేడ లిల్లి పాల్గొన్నారు.

యువతకు అండగా నిలుద్దాం

యలమంచిలి రూరల్: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో యువత పోరు పోస్టర్‌ను పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర, ముఖ్య నాయకులతో కలిసి సోమవారం సాయంత్రం విడుదల చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు అత్రైపు గుప్తా, బెజవాడ నాగేశ్వర్రావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు పడాల శ్రీను, వార్డు కౌన్సిలర్లు కిరణ్, దూది నర్సింహమూర్తి, పార్టీ ముఖ్య నేతలు దాసరి కుమార్, కొఠారు కొండబాబు, కోడిగుడ్డు రమణ, పిల్లా త్రినాథ్, గొంపాని శివ, డబ్బీరు రవి, ఆడారి మహేష్, అంకిరెడ్డి నర్సింగరావు, దాసరి గణేష్ పాల్గొన్నారు.



యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



యువత పోరు పోస్టర్ విడుదల చేస్తున్న అచ్యుతాపురం నాయకులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మునగపాక జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ

అచ్యుతాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12న జరగబోయే యువత పోరు కార్యక్రమానికి విద్యార్థులు, నిరుద్యోగ యువత తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు కోరారు. ఈ మేరకు సోమవారం అచ్యుతాపురంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన పోస్టర్ విడుదల చేశారు. జెడ్పీటీసీ కో–ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, జిల్లా అధికార ప్రతినిధి పిన్నమరాజు వాసు, చోడపల్లి ఎంపీటీసీ లాలం శ్రీను, సర్పంచ్‌లు లాలం లక్ష్మీపైడికొండ, సియ్యాద్రి బుజ్జి, రాజాన నాయుడుబాబు, పంచదార్ల పైడిరాజు, మండల నాయకులు మాడెం సూరిఅప్పారావు, పంచదార్ల రవి, కొవిరి దేముడు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఘటాల ఊరేగింపు



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న గ్రామ పెద్దలు

పాయకరావుపేట: మండలంలో కుమారపురం గ్రామంలో ఏకాదశి నుంచి కొత్త అమావాస్య వరకు 20 రోజుల పాటు గరగలతో జాతర నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం గ్రామ దేవత ఘటాలను పల్లకిలో ఊరేగిస్తూ అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో పసుపుకుంకుమ సమర్పించారు. అదే రోజు రాత్రి కుమారపురం నుంచి 25 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఉపమాక దేవస్థానానికి వెళ్లి అక్కడ ప్రాంగణంలో గరగల నృత్యం చేశారు.

విద్యార్థిని రేవతికి ఎమ్మెల్యే అభినందన

అచ్యుతాపురం రూరల్: ఆంధ్రా యూనివర్సిటీ డిగ్రీ బీఎస్సీ ఫలితాల్లో 9.63 పాయింట్స్ కైవసం చేసుకున్న విద్యార్థిని పాలిపిని రేవతిని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సోమవారం అభినందించారు. ఆమె భవిష్యత్తులో మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. అచ్యుతాపురం కళాశాలలో చదువుతున్న రేవతిని కరస్పాండెంట్ పల్లి శేశగిరిరావు, ఉమావాణి, అధ్యపకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



విద్యార్థిని రేవతిని అభినందిస్తున్న సుందరపు

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి

పాయకరావుపేట: ప్రకృతి వ్యవసాయంపై సిబ్బంది దృష్టి సారించాలని, ప్రతి మండలంలోను దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.ఉమాప్రసాద్ తెలిపారు. డివిజన్ పరిధిలో పాయకరావుపేట, నక్కపల్లి, కోటవురట్ల, నాతవరం, మాకవరపాలెం మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణపై రైతులకు సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఈ నెలాఖరులోగా రైతుల పేర్లు, భూముల వివరాలు రికార్డు పూర్తి చేయాలన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ ఉమాప్రసాద్